మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## రైతులకు ఇబ్బంది లేకుండా పత్తి కొనుగోలు నిర్వహించాలి



పత్తి కొనుగోలు ప్రక్రియను సజావుగా చేపట్టాలని అధికారులకు సూచిస్తున్న కలెక్టర్

**కల్వకుర్తి, నవంబర్ 11 ప్రభాతవార్త:** కల్వకుర్తి మండల పరిధిలోని తర్నికల్ గ్రామ శివారులో ఉన్న బాలాజీ జిన్నింగ్ మిల్లును నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించి కొనుగోలు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జిన్నింగ్ మిల్లుల యజమానులు కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సూచించారు. అకాల వర్షాల వలన ప్రస్తుత పత్తి కొనుగోలు సీజన్‌కు సంబంధించిన ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని, రైతులకు సరైన మద్దతు ధర (ఎంఎస్‌పి) చెల్లింపులో పారదర్శకత ఉండాలని ఆయన పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు తూకం, చెల్లింపు ప్రక్రియలను సక్రమంగా నిర్వహించాలన్నారు. మద్దతు ధరలకు పత్తి కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని, రైతులకు అన్ని సదుపాయాలు అందేలా చూడాలని ఆయన సూచించారు. సీసీఐ అధికారులు, జిన్నింగ్ మిల్లుల యజమానులు మరియు సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పత్తి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పారదర్శకంగా, వేగంగా కొనుగోలు ప్రక్రియ సాగేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. సీసీఐ అధికారులు మరియు మిల్లుల యజమానులు రైతులకు తగిన మద్దతు ధర చెల్లించడం, తేమ శాతం పరిశీలనలో నిబంధనలు పాటించడం, బరువు తూకం పట్ల నిష్పక్షపాతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట కల్వకుర్తి తహసిల్దార్ ఇబ్రహీం, జిన్నింగ్ మిల్లు అధికారులు తదితరులు ఉన్నారు.



వరి ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

## సకాలంలో డబ్బులు అందేవిధంగా చర్యలు

**నిబంధనల ప్రకారం తేమ, తాలు చూసుకొని వెంటనే తూకం చేయాలి**

**వనపర్తి, నవంబరు 11 ప్రభాతవార్త:** వడ్లు అమ్మిన రైతుకు ఇబ్బందులు లేకుండా సకాలంలో డబ్బులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం పెద్దమందడి మండలంలోని వెల్టూరు గ్రామం చేనేత కార్మికుల కాలనీలో ఐకేపి ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని, మోజర్ల గ్రామంలోని వారాహి రైస్ మిల్లును కలెక్టర్ సందర్శించారు. రైతు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చాక నిబంధనల ప్రకారం తేమ, తాలు చూసుకొని వెంటనే తూకం చేయాలని సూచించారు. అంతేకాకుండా రైతులు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని వివరాలు సేకరించి రైస్ మిల్లు నుండి త్వరగా ట్రక్ షీట్ తెప్పించుకొని వాటి ఆధారంగా రైతుకు సంబంధించిన ధాన్యం వివరాలు ఆన్లైన్ లో అప్లోడ్ చేసి త్వరగా డబ్బులు అకౌంట్‌లో పడే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రంలో రైతుకు సంబంధించిన ధాన్యం వివరాలు ఆన్లైన్ లో ఏవిధంగా అప్లోడ్ చేస్తున్నారో - మిగతా4లో..



కలాం చిత్రం పటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, జిల్లా అధికారులు

## బహు భాషా కోవిదుడు

- విద్యారంగ అభివృద్ధికి పునాదులు వేసి మహోన్నతుడు
- మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు అమోఘం
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మూసాపేట, నవంబర్11,ప్రభాతవార్త:** భారత స్వాతంత్ర సమరయోధుడు,బహు భాషా కోవిదుడు, దేశ విద్యారంగ అభివృద్ధికి పునాది వేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ ను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ సమాజ,దేశ అభివృద్ధికి అంకిత భావంతో సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పిలుపునిచ్చారు. భారత దేశ మొదటి విద్యా శాఖ మంత్రి, మైనార్టీల అభివృద్ధికి ఎంతో కృషిచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా - మిగతా4లో..



వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

## రైతు సంక్షేమానికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి**

**మహబూబ్‌నగర్, నవంబరు 11 ప్రభాతవార్త :** రైతు సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని నవాబుపేట మండల పరిధిలోని పలు గ్రామాలలో వరి కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవంలో మంగళవారం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులు కనీస మద్దతు ధర లేక నష్టపోయారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుకు మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌తో కూడిన ప్రోత్సాహకాన్ని అందిస్తున్నామని రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో మాత్రమే రైతులు గిట్టుబాటు ధరకు వడ్లను అమ్ముకోవాలని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు గ్రామపంచాయతీ అధికారులు వ్యవసాయ అధికారులతో పాటు ఐకెపి అధికారులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నీరటి రామచంద్రయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ హరలింగం,వైస్ చైర్మన్ తులసిరామ్ నాయక్, యూత్ అధ్యక్షులు నీలకంఠం, రాజశేఖర్,వెంకటేష్ గౌడ్,నవాజ్ రెడ్డి, రవీందర్ రెడ్డి,మాజీ ఎంపిటిసిలు అంబదాస్, నర్సింలు, గుండేటి యాదయ్య, బంగ్లా రవీందర్,శీర్ప సత్యం, వేణు గౌడ్, శ్రీనివాస్, రాజేష్, అంక ఆంజనేయులు, వెంకటయ్య, సురేష్, కొండాపూర్ యాదయ్య, గ్రామ కాంగ్రెస్ నాయకులు మండల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు ఇబ్బందులు కల్గించొద్దు

- కలెక్టర్ విజయేంద్ర బోయి
- కొనుగోలు కేంద్రాలను తనిఖీ



కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మూసాపేట, నవంబర్11,ప్రభాతవార్త :** ధాన్యం కొనుగోలుకు రైతులు ఇబ్బంది లేకుండా అన్ని వసతులు కల్పించి కొనుగోళ్లు సాఫీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మూసాపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామం, కొమ్మిరెడ్డి పల్లె గ్రామంలలో ఐ.కె.పి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకు వచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతుల సౌకర్యార్థం కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ప్యాడి క్లీనర్, ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ లను ఉపయోగించి చెత్త,తాలు లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకుని రావాలని సూచించారు. నిర్ణీత తేమ శాతం,నాణ్యతా ప్రమాణాలు ప్రకారం ధాన్యానికి క్రమ పద్ధతిలో టోకెన్‌లు అందచేసి రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు సరైన తేమ శాతం వచ్చిన ధాన్యం కొనుగోలు చేయాలని ఆదేశించారు కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలని ఆదేశించారు. ఏ రైతు మిల్లుకు రాకుండా చూడాలని ప్రతి రైతు బాధ్యత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులదే అని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన తేమ వచ్చిన ధాన్యాన్ని తొందరగా మిల్లుకు సరఫరా చేయాలని ఆదేశించారు. కొమ్మిరెడ్డి పల్లె గ్రామం ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్ పనిచేసే విధానాన్ని పరిశీలించింది. మూసాపేట్ మండలంలో తిమ్మాపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించి బోర్డుపై ఉన్న వర్ణమాలను,సరళ పదాలను, ఏబీసీలను. పిల్లలతో చదివించింది అక్కడున్న ఉపాధ్యాయులతో మాట్లాడుతూ, విద్యార్థులతో నిత్యం చదివించడం, రాయించాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పేర్కొన్నారు. అక్షయపాత్ర ద్వారా వచ్చిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించింది పిల్లలకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని గ్రామంలో అంగన్వాడీని తనిఖీ చేశారు. అంగన్వాడీలోని మధ్యాహ్నం భోజనం చేస్తున్న పిల్లలు ఆహారాన్ని పరిశీలించింది ఆహారంలో నాణ్యత లేకపోవడం వల్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పప్పు చారు లాగా ఉండడం వలన పప్పులో ఆకుకూర ఏంటిది? పప్పు ఇంత పల్చగా ఉంది ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు మంచి పోషకమైన ఆహారం అందించాలని పిల్లలకు, పౌష్టిక ఆహారం,గుడ్లు సక్రమంగా అంద చేయాలని, వారిని క్రమం తప్పకుండా పర్యవేక్షణ చేయాలని,సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో పిల్లలు కూర్చునేందుకు మ్యాట్ లు ఉన్నా ఉపయోగించక పోవడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీఆపరిశుభ్రంగా ఉండటం గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల పట్ల నిరక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంట డి.ఆర్.డి. ఓ నర్సింహులు,తహశీల్దార్ రాజు,మండల,గ్రామ అధికారులు తదితరులు ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయుడు

## పత్తి రైతులకు న్యాయం చేయండి...

**సి. సి. ఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే**

**ఇటిక్యాల నవంబర్ 11, ప్రభాతవార్త :** రైతులు కష్టపడి పత్తి పంట సాగు చేసిన వర్షాల వల్ల పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని అరకో రగా పండిన పత్తిని సి.సి.ఐ కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చారని రైతులకు ఇబ్బందులు కలగ కుండా అధికారులు పత్తిని కొనుగోలు చేయాలని అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు అధికారులను కోరారు. మంగళవారం ఉండవల్లి మండల పరిధిలోని వరసిద్ధి వినాయక పత్తి మిల్లులో సి.సి.ఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయగా పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడుతున్న కష్టాలను ఎమ్మెల్యే చూసి ఆరా తీసి అధికారులకు వివరించారు. తుఫాన్లతుఫాన్ల వల్ల కురిసిన వర్షాలకు పత్తిలో తేమ శ్నాత పరిగణలోకి తీసుకోకుండా రైతులు తెచ్చిన పత్తిని తిరస్కరించి రైతులను నష్టపరచ రాదని రోజు లు తరబడి వేచి చూస్తున్న రైతుల పత్తిని కొనుగోలు చెయ్యాలని మరియు వెనక్కి పంపవద్దని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే విజ యుడు కోరారు. ఈ విషయంపై అధికారులు సానుకూలంగా స్పందిం చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



స్వామివారి హుండీని లెక్కిస్తున్న దృశ్యం

## శ్రీ కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

**రూ.24.83 లక్షల ఆదాయం**

**మహబూబ్‌నగర్, నవంబరు 11 ప్రభాతవార్త :** శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు పల్లె ప్రాంతాల నుంచే కాకుండా పట్టణ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకున్న అనంతరం కానుకల రూపేనా హుండీలో వేసిన నగదును మంగళవారం ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి సమక్షంలో రెండవ హుండీ ని లెక్కించగా 24 లక్షల 83 వేల 628 వందల రూపాయలు ఆదాయం రావడం జరిగిందని - మిగతా4లో..

## విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచి కరమైన భోజనాన్ని అందించాలి

**విద్యార్థులతో కలిసి భోజనం చేసిన పేట కలెక్టర్**



భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

**మక్తల్ టౌన్, నవంబరు 11 ప్రభాతవార్త:** విద్యార్థులకు నాణ్యతతో కూడిన రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం ఆమె మక్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలె పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో పాఠశాలలో నిర్వహిస్తున్న మౌలానా అబ్దుల్‌కలామ్ ఆజాద్ జయంతి (జాతీయ విద్యా దినోత్సవం) వేడుకల్లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు అజాద్ జయంతి గురించి స్పీచ్‌లు ఇచ్చారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పదవ తరగతి సిలబస్ ఇప్పటివరకు ఎంత వరకు పూర్తి అయిందని విద్యార్థులను ద్వారా తెలుసుకున్నారు.ఏ సబ్జెక్ట్ చదవడానికి కష్టం అవుతుందని ప్రశ్నించారు. గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం మెరుగైన ఫలితాలు సాధిస్తామని విద్యార్థులు తెలపగా అందులో 20మంది విద్యార్థులు 550పై మార్కులకు పైగా సాధిస్తామన్నారు. తర్వాత భోజన సదుపాయపై కలెక్టర్ ఆరా తీశారు. రోజూ ఉదయం ఎన్ని గంటలకు లేస్తారని లేచాక ఏమి చేస్తారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఫ్యూచర్ ప్లానింగ్ గురించి ఒక్కొక్కరిని అడిగారు. ఏమేమి ఆటలు ఆడతారని ప్రశ్నించారు. స్లిప్ టెస్టులు పెడుతున్నారా? లేదా ? నాన్ వెజ్ తింటున్నారా లేదా అని,మెస్ కమిటీ ఉందా? ఆ కమిటీ సభ్యులు ముందుగా భోజనం రుచి చూస్తున్నారా అని విద్యార్థులతో ఆరా తీశారు. వసతి గృహంలో ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని విద్యార్థులకు సూచించారు. వండిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మధ్యాహ్న భోజన నాణ్యత, రుచిని తెలుసుకునేందుకు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మక్తల్ తహసిల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీవో, రెవెన్యూ అధికారులు, వసతి గృహ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పనితీరు మెరుగుపర్చాలి

**- కలెక్టర్ విజయేంద్ర బోయి**



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్11,ప్రభాతవార్త** అంగన్వాడి కేంద్రాల పని తీరు మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వి.సి.కాన్ఫరెన్స్ హాల్ లో మహిళా,శిశు సంక్షేమ శాఖ సి.డి.పి. ఓ.లు,సూపర్వైజర్ లతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో హాజరుశాతం పెంచాలని అన్నారు. గ్రామంలో అంగన్వాడి కేంద్రాలకు ఎంత మంది హాజరు అవుతున్నారు..పాఠశాలకు ఎంత మంది వెళుతున్నారు. విషయాలపై స్పష్టత కలిగి ఉండాలని అన్నారు. గ్రామంలో ఉన్న పిల్లలు అంగన్వాడి లేదా పాఠశాలకు హాజరు కావాలని అన్నారు.ఇందుకు గ్రామంలో సర్వే చేయడం జరుగుతుందని అన్నారు. బరువు, పోషక లోపం ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందించి సాధారణ స్థితి కి తీసుకురావాలని అన్నారు.సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్,మహిళా,శిశు, దివ్యాంగుల,వయో వృద్ధుల శాఖ సంక్షేమ అధికారిణి జరీనా బేగం తదితరులు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను తరలిస్తూ ఆటో బోల్తా..

- నలుగురికి తీవ్ర గాయాలు..
- ప్రధానోపాధ్యాయుడి నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు గాయాలు...



ప్రమాదంలో గాయపడిన విద్యార్థిని ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం



బోల్తా పడ్డ ఆటో

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, నవంబర్ 11 ప్రభాత వార్త:** ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు తరలించడం కోసం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను తీసుకెళ్లిన ట్రాలీ ఆటో ప్రమాదవశాత్తు బోల్తా పడ్డ ఘటనలో నలుగురు విద్యార్థులు తీవ్ర గాయాల పాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలకు పార్ట్-2 పాఠ్యపుస్తకాలను ఆటోలో తీసుకొచ్చేందు కు 9వ తరగతి చదువుతున్న విద్యార్థులను వినియోగించారు. సాతాపూర్ గ్రామ సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు టైరు పేలి ఆటో బోల్తా కొట్టింది. దీంతో 9వ తరగతి చదువుతున్న కార్తీక్, అశోక్, నాని,శివ అనేవిద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని నాగర్‌కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. వారిలో శివ అనే విద్యార్థి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు తెలిపారు. పాఠశాలలో చదువుకోవాల్సిన విద్యార్థులను పాఠ్యపుస్తకాలు తరలించేందుకు వినియోగించడంపై ఉపాధ్యాయులపై తల్లిదండ్రులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్‌ను వివరణ కోరగా తనకు ఎలాంటి సంబంధం లేదన్నట్లు వ్యవహరించడంపై విద్యార్థి సంఘాలు, విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నాయి. సంఘటనపై మంత్రి జూపల్లి కృష్ణారావు ఆందోళన వ్యక్తం చేసి సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి శివకు మెరుగైన వైద్యాన్ని అందించాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు.

### ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్...

**మండల విద్యాధికారికి షోకాస్ నోటీస్ జారీ**

నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాతాపూర్‌కు పుస్తకాలు తీసుకురావడానికి పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి వెళ్లి ప్రమాదానికి గురైన విద్యార్థుల ఘటనపై జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నిర్లక్ష్యంగా వ్యవహరించిన సాతాపూర్ ప్రధానోపాధ్యాయుడిని సస్పెన్షన్, పెద్దకొత్తపల్లి మండల విద్యాధికారికి షోకాస్ నోటిస్ జారీ చేయాలని ఆదేశాల మేరకు సాతాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీశైలంను విధుల నుండి సస్పెండ్ చేస్తూ, పెద్దకొత్తపల్లి మండల విద్యాధికారి కే శ్రీనివాసరెడ్డికి షోకాస్ నోటీస్ జారీ చేసినట్లు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్‌కుమార్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.



చికిత్స పొందుతున్న విద్యార్థులు

## ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



**జడ్చర్ల, నవంబర్ 11 ప్రభాతవార్త:** జాతీయ విద్యా దినోత్సవం మరియు మైనారిటీల సంక్షేమ దినోత్సవం జడ్చర్ల మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ (బాయ్స్ 1)లో ప్రిన్సిపాల్ పారిజాత గారి అధ్యక్షతన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఆకర్షణీయమైన ప్రదర్శనలు ఇచ్చారు. క్రీడా, వ్యాసరచన, ప్రసంగ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు మరియు సర్టిఫికెట్లు అందజేయబడ్డాయి. విద్యార్థులు మోలానా అబుల్ కలామ్‌ఆజాద్ గారి సేవలు, కృషి, మరియు దేశానికి చేసిన కీర్తనీయమైన కృషిని స్మరించారు. కార్యక్రమంలో మక్సూద్ అలీ, అఖీల్ అలీ (మోటివేషనల్ స్పీకర్స్), ఉమ్ముల్ సుగ్రా, మనోర సుల్తానా, నాజియా బేగం, షహ్నాజ్ జహాన్, సరళ, సప్నా, షేక్ హుస్సేన్, శేఖర్, రాఘవేంద్రన్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## చోరీకి పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తులు

### -కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ మహేష్

**వంగూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:** పట్టపగలు ప్రజలు సంచరిస్తున్న సమయంలో మూసి ఉన్న తలుపులు మూసి ఉన్న ఇంట్లో చొరబడి చోరీకి పాల్పడిన సంఘటన కలకలం రేపుతుంది. ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారంవంగూరు మండలము తుమ్మలపల్లి గ్రామానికి చెందిన అరేకంటి నిరంజన్‌ఇంట్లో మంగళవారం ఉదయం 9:40 గంటల సమయంలో ఇంటి తలుపు దగ్గరికి మూసి ఆలయానికి వెళ్లి 10:30 గంటలకు తిరిగి ఇంటికి వచ్చి చూడగా ఆయన ఇంట్లో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బీరువా తెరిచి బంగారు ఆభరణాలు, వెండి పట్టీలు, రూ.20,000 నగదు మొత్తం విలువ రూ.90,000 వేలుదొంగిలించినట్లు తెలిపారు. ఈ మేరకు నిరంజన్ పిర్యాదు మేరకు వంగూరు పోలీస్ స్టేషన్ ఎస్సై పి.మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**మద్దూరు, నవంబరు 11 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని ఖాజీపూర్, చెన్నారెడ్డిపల్లి, రెనివట్ల, అప్పిరెడ్డిపల్లి, పల్లెగడ్డ తండా, దొరపల్లి, మద్దూరు గ్రామాల్లో ఐకెపి ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ గుళ్ళ నరసింహులు మాట్లాడుతూ రైతులు మధ్యవర్తుల చేత మోసపోకుండా ఐకెపి కేంద్రాల ద్వారా ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ నిర్ణయించిన కనీస మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ.2,389/ సాధారణ రకం ధాన్యానికి రూ.2,369/ పొందాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తేనే పూర్తి లాభం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రఘుపతి రెడ్డి, ముద్ది సుభాష్, సుకుమార్, ఏపిఎం కృష్ణవేణి, మహిళా సమైక్య అధ్యక్షురాలు సవిత, కార్యదర్శి సుగుణమ్మ, కోశాధికారి కవిత, సిసి మాణిక్యప్ప, అకౌంటెంట్ పుష్ప, ఆపరేటర్ మొగులప్ప, వివోలు, వెంకటరాములు గౌడ్, కొరవొని రాములు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నిరంతర కృషితోనే విజయం సాధ్యం

**గద్వాల టౌన్ నవంబర్ 11, ప్రభాతవార్త:** విద్యార్థులు నేర్చుకున్న విషయాన్ని బాగా అర్థం చేసుకుని, దాన్ని నిరంతరం ఆచరణలో పెట్టినప్పుడే విజయాన్ని సులభంగా సాధించగలరని జిల్లా ఉపాధి కల్పన అధికారి డా.యం.ప్రియాంక తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డా.యం.ప్రియాంక మంగళవారం గట్టు మండలము, బోయలగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో 9వ,10వ తరగతి విద్యార్థులకు "చదువులో విజయం, జీవితంలో వివేకం" అనే అంశంపై మోటివేషన్, కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్య అనేది మన జీవితానికి లభించిన మహా వరమని, చదువుకోవాలనే కోరిక బలంగా ఉంటే ఎలాంటి సబ్జెక్ట్‌అయినా సులభమే అని విద్యార్థులను ప్రోత్సహించారు. విజయానికి మార్గం నిరంతర కృషి, సమయపాలన, ఆత్మవిశ్వాసమని తెలిపారు. పరీక్షలు కేవలం మార్కుల కోసం కాకుండా జ్ఞానం కోసం రాయాలని సూచించారు. డిజిటల్ సాధనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చదువుకు అనుకూలమైనవాతావరణం, క్రమశిక్షణ, ప్రతిరోజూ పునశ్చరణ అలవాటు చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. తదుపరి ఆమె మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వంట సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సేవల కొరతపై బీజేపీ నేతల అర్ధనగ్న ప్రదర్శన




అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న బిజెపి నేతలు

**నారాయణ పేట, నవంబరు 11 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో వైద్యసేవల కొరతపై బీజేపీ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు తగిన వైద్య సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని పళ్ళ హనుమాన్ మందిరం నుంచి సెంటర్ చౌక్ వీర సావర్కర్ చౌరస్తా మీదుగా సత్యనారాయణ చౌర స్తా వరకు ప్రదర్శన సాగింది. జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, నాగురావు నామాజీ మాట్లాడుతూ పేటలో ప్రభుత్వ ఆస్పత్రి కోసం ఎన్నిసార్లు పోరాటాలు చేసినా పాలకులు స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు సరైన వైద్య వసతుల లేమితో ప్రాణాలు కోల్పోతున్నారని పేర్కొన్నారు. కార్యకర్తలు జిల్లాకు ఆస్పత్రి కావాలి ప్రజల ప్రాణాలతో ఆటలాడొద్దు మాతాశిశు ఆస్పత్రి వెంటనే నిర్మిం చాలి అంటూ నినాదాలు చేశారు. నారాయణపేట జిల్లా ఏర్పడి ఏడేళ్లు గడిచినా సరైన వైద్య వసతులు అందుబాటులో లేవని చిన్న వ్యాధులకే ప్రజలు మహబూబ్‌నగర్ లేదా హైదరాబాద్ వెళ్లాల్సి వస్తోందని నాయకులు తెలిపారు. ఆస్పత్రి నిర్మాణం ప్రారంభమయ్యే వరకు పోరాటం కొనసాగిస్తామని ఇది బీజేపీ పోరాటం మాత్ర మే కాకుండా ప్రజల పోరాటమని సత్యయాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పోషల్ వినోద్, సత్యరఘుపాల్, గోపాల్ రావు, గోపాల్, శ్రీనివాస్, శివ, సాయిబన్న పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

### రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలి : జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**మాగనూర్, నవంబరు 11 ప్రభాతవార్త:** మాగనూర్ మండలంలోని పలు వరి కొనుగోలు కేంద్రాలను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ముందుగా అడివి సత్యారం గ్రామ పంచాయతీ పరిధిలో వరి కొనుగోలు కేంద్రానికి ఇప్పటి వరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం విక్రయానికి వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో గన్ని బ్యాగ్లు ఎన్ని అందు బాటులో ఉన్నాయని కలెక్టర్ ప్రశ్నించగా 15వేల బ్యాగ్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వా హకులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఈ వారం రోజు ల్లో హార్వెస్టింగ్ ఎంత ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 1776 ధాన్యం బస్తాల ను మిల్లులకు తరలించడం జరిగిందని సిబ్బంది చెప్పారు. సెంటర్లలో ప్యాడీ మాయిచ్చర్ క్లీనర్ లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. అన్ని సెంటర్లలో తప్పనిసరిగా వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని, కొనుగోళ్లకు సంబంధించిన అన్ని వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ముఖ్యంగా కొనుగోలు సెంటర్లలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడా లన్నారు. ప్రతి అధికారి స్థానికంగా ఉండాలన్నారు. సన్నరకం బియ్యం బస్తాలపై ఎస్ అని రాయాలన్నారు. అలాగే సంచులలో ధ్యానం నింపిన తర్వాత ఎర్ర దారంతో సంచులను కుట్టిం చాలని ఆమె సూచించారు. కాగా అడవి సత్యారం గ్రామానికి అదనంగా మరో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అక్కడి రైతులు కలెక్టర్‌ను కోరగా స్పందించిన కలెక్టర్ మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయించాలని అదనపు కలెక్టర్ శ్రీను కు సూచించారు. ఈ కార్యక్రమంలో మాగనూర్ తహసిల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీఓ శ్రీనివాసులు సంబంధిత అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



ధాన్యం తేమశాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలి

◆ నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ◆ కల్వకుర్తి మార్కెట్ యార్డులో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**కల్వకుర్తి, నవంబర్11 ప్రభాతవార్త:** మంగళవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రైతులతో మాట్లాడి వారికి అందిస్తున్న సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. మొక్కజొన్న సేకరణ కేంద్రంలో రైతుల నుండి సేకరించిన మొక్కజొన్న నిల్వల నాణ్యతను స్వయంగా పరిశీలించి, కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరుగుతుందా అనే అంశాన్ని పరిశీలించారు. తేమశాతం యంత్రం సహాయంతో పరీక్షించి, పంట నాణ్యతను అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం ప్రమాణాలు సరిగ్గా పాటించబడుతున్నాయా లేదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాలనుసమీప ప్రాంతాల్లో మరింత అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ప్రతి కొనుగోలు కేంద్రంలో సరిపడా అన్ని వసతులను అందుబాటులో ఉండేలాచూడాలని సూచించారు. రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చిన పంటను నిల్వ చేయడంలో లేదా తరలించడంలో సమస్యలు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రవాణా సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా ప్రణాళికలు సిద్ధం చేయాలని, రవాణా వ్యవస్థ సజావుగా సాగేందుకు ట్రాక్టర్ల మరియు లారీలు అందుబాటును సమీక్షించాలని అధికారులు సూచించారు. పంట తేమ శాతం, నాణ్యత ప్రమాణాలపై సిబ్బంది స్పష్టమైన అవగాహనతో పని చేయాలని, రైతులకు తగిన ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. రైతులు కేంద్రాలకు తెచ్చిన వెంటనే తూకం వేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ అనవసర కాలయాపనతో రైతులను ఇబ్బంది పెట్టకుండా చూడాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన మొక్కజొన్న ఆన్లైన్ వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియలో పారదర్శకతను కాపాడుతూ, రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చూసుకోవాలని కలెక్టర్ ప్రత్యేకంగా సూచించారు. రైతులు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట మార్క్ ఫెడ్ అధికారులు తహసీల్దార్ ఇబ్రహీం, తదితరులు ఉన్నారు.



మొక్కజొన్న కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

# నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

◆ ఇంజనీరింగ్ అధికారులతో పియంశ్రీ పై కలెక్టర్ సమీక్ష

**వనపర్తి, నవంబరు11 ప్రభాతవార్త:** గ్రామీణ విద్యార్థులకు ఆధునిక మౌలిక వసతులతో అత్యున్నత నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పియం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) నిధులను సకాలంలో సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఐడిఒసి సమావేశ మందిరంలో వనపర్తి జిల్లాలో పియం శ్రీ కింద ఎంపిక అయిన 2ప్రభుత్వ పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు, కెజిబివి, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్, ఇంజనీరింగ్ అధికారులతో పియంశ్రీ పై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించినాణ్యమైన విద్యను అందించేందుకు వనపర్తి జిల్లాలో 21 పాఠశాలలను ఎంపిక చేయడం జరిగిందని అదే విధంగా జిల్లాలోని కెజిబివిలు, జూనియర్ కళాశాలలను ఎంపిక చేసి వాటికి అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చుకునేందుకు పియంశ్రీ ద్వారా నిధులు మంజూరి చేయడం జరిగింది. 2023 24,25 వరకు 13.26కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తే ఇప్పటి వరకు కేవలం 7 కోట్లు మాత్రమే ఖర్చు చేయడం జరిగిందని, మిగిలిన నిధులు సైతం మార్చిలోపు ఖర్చు చేయాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా ఈ సంవత్సరం జిల్లాకు రూ. 6.01కోట్ల నిధులు మంజూరు చేస్తే ఇప్పటి వరకు రూ. 2.00 కోట్లు మాత్రమే ఖర్చు.చేశారని చెప్పారు. వచ్చిన బడ్జెట్ నేరుగా ప్రధానోపాధ్యాయులఅకౌంట్‌కు జమ చేయడం జరిగిందని, ఎస్ యంసి ద్వారా పనులుచేయించి మార్చి, 2026 వరకు మొత్తం నిధులు ఖర్చు చేసే విధంగా చూడాలని సూచించారు. అదనపు గదులు, మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, సైన్స్ ల్యాబ్, భవిత సెంటర్ ఏర్పాటు వంటి పనులకు నిధులు మంజూరు చేయడం జరిగింది. మౌలిక సదుపాయాలు మాత్రమే కాకుండా బడిబాట, న్యూస్ పేపర్, మ్యాగజీన్‌ల కొనుగోలు, ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, గ్రీన్‌స్కూల్ కాంపిటీషన్, ఐఐటి, ఎంఐటిల సందర్శన, యూత్ ఇకో క్లబ్ వంటి కార్యక్రమాల నిర్వహణకు సైతం పియంశ్రీ నిధులు మంజూరు చేయడం జరుగుతుంది. వీటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు అత్యున్నత నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేయాలని అప్పుడే ఈ పథకం సార్థకమవుతుందని కలెక్టర్ వివరించారు. ఎక్కడైనా స్థలం లేని పక్షంలో ఇతర పియం శ్రీ పాఠశాలకు నిధులు మళ్లించి పనులుచేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను సూచించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, టిజి ఇడబ్ల్యుఐడిసి కార్యనిర్వహాక ఇంజనీరురామచందర్, ఎఈలు, పియంశ్రీ ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు, జిసిడిఒ శుభలక్ష్మి పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

# అడిషనల్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

**దామరగిద్ద, నవంబరు11 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంలోని మండల పరిధిలోని క్యాతన్ పల్లి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ సంచిత్ అగర్వాల్ పరిశీలించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ చిన్నారుల హాజరు, పోషకాహార పంపిణీ, ఆరోగ్య పర్యవేక్షణ, విద్యా కార్యక్రమాల అమలు విధానాలను సమీక్షించారు. అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించి, పిల్లలకు సమయానికి ఆహారం, అందజేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని పశువైద్యాలయాన్ని జిల్లా అడిషనల్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందుతున్న సేవలు గురించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆస్పత్రిలోని రికార్డులను తనిఖీ చేశారు. పశువులకు అందిస్తున్న టీకాలు, నులిపురుగుల నిర్మూలన తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్యాలయంలో అందించే సేవలపై ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన పేదవారికి సొంత ఇంటికల నెరవేర్చాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ళు మంజూరు చేసిందని జిల్లా అడిషనల్ సంచిత్ అగర్వాల్ అన్నారు. దామరగిద్ద మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పురోగతి పనులను అడిషనల్ కలెక్టర్ పరిశీలించారు. మంజూరైన ఇండ్లు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్న పురోగతిని సంబంధిత హౌసింగ్ ఏఈని అడిగి తెలుసుకున్నారు. జాప్యం లేకుండా ఇందిరమ్మ ఇండ్ల బిల్లులు మంజూరు అయ్యే విధంగా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు బిల్లుల చెల్లింపులో జప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని మండలంలోని మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరు చేయడం జరిగింది, అందులో ఎన్ని నిర్మాణాలలో ఉన్నాయో, ఎన్ని స్లాబ్ లెవల్‌లోఉన్నాయి, ఎన్ని బేస్మెంట్ లెవల్‌ఉన్నాయి అనిఎంపీడీఓని అడిగి తెలుసుకు న్నారు. బేస్మెంట్ లెవల్, లెంటల్ లెవల్‌వరకు పూర్తి అయిన వారికి లబ్ధిదారుల అకౌంట్‌లలో డబ్బులు జమ అయ్యాయా అని తెలుసుకున్నారు. ఇంకాఫోటో కాప్చర్ చేయనవి ఉంటే ఆలస్యం చేయకుండావెంటనే చేయాలని హౌసింగ్ ఏఈలను ఆదేశించారు. మండలంలోఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయి, అవి ఏఏ దశల్లో వున్నాయి అని పరిశీలించారు. ఈకార్యక్రమంలోఎంపీడీవో సాయి లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, సంబంధిత అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న దృశ్యం

# పాఠశాలలను సురక్షితంగా ఉంచడం అందరి బాధ్యత

**గద్వాల టౌన్ నవంబర్11, ప్రభాతవార్త:** పాఠశాలలను శుభ్రంగా, సురక్షితంగా, బాలికలకు అనుకూలంగా తీర్చిదిద్దడం అందరి బాధ్యత అని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని వజ్ర ఫంక్షన్ హాల్‌లో డిఆర్డిఏ, యూనిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోర బాలికల సమస్యలు మరియు పాఠశాలలలో వాష్ రూమ్, వాటర్, శానిటేషన్, హైజిన్ అంశాలపై అవగాహన సమావేశంలో అదనపు కలెక్టర్ బి. నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనిసెఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన 94 పాఠశాలల వాష్ సర్వే నివేదికను విడుదల చేశారు. నరసింహారెడ్డి సర్వే వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.నర్సింగరావు మాట్లాడుతూ, బాలికల విద్యా ప్రగతి కోసం పాఠశాలల్లో పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, శౌచాలయాల నిర్వహణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. బాలికల కోసం ప్రత్యేక శౌచాలయాలు, హైజిన్ సదుపాయాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో హైజిన్‌పై విద్యార్థులలో అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఎంఈఓలు మరియు ప్రధానోపాధ్యాయులు నెలనెలా పాఠశాల పరిశుభ్రత, నీటి వనరుల పరిస్థితిపై సమీక్ష చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ నేషనల్ ఆఫీసర్ మురళీకృష్ణ, ప్రతినిధులుఏ. వెంకటేష్, మెరీ జోన్స్, అదనపుడిఆర్డిఓ శ్రీనివాస్, జిల్లావిద్యా అధికారి విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈ.ఈ శ్రీధర్ రెడ్డి, జిల్లా ఆసుపత్రి నుండి డాక్టర్ ప్రసూన, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



పాఠశాల పరిశుభ్రతపై మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నర్సింగ రావు

# న్యాయవాదుల పాదయాత్రకు స్థానిక నాయకుల సంఘీభావం

**ఇటిక్యాల నవంబర్ 11, ప్రభాతవార్త:** న్యాయవాదులపై దాడులు జరుగుతుండగా వారికి ప్రత్యేక చట్టం ఏర్పాటు కోసం డిమాండ్ చేస్తూ అల్లంపూర్వారికి ప్రత్యేక చట్టం ఏర్పాటు కోసం డిమాండ్ చేస్తూ అల్లంపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు నాయకత్వంలో ఈనెల తొమ్మిదిన అల్లంపూర్ జోగులాంబ ఆలయం నుండి చలో పాదయాత్ర అల్లంపూర్ నుండి హైదరాబాదులో ఉన్న హైకోర్టు వరకు న్యాయవాదులు ప్రారంభించారు. ఈ పాదయాత్ర సోమవారం సాయంత్రానికిమండల పరిధిలోని బీచుపల్లి వద్దకు చేరుకోగా వారు అక్కడే బస చేశారు. తిరిగి మంగళవారం బీచ్‌పల్లి నుండి పెబ్బేరు వైపు న్యాయవాదులు పాదయాత్రను ప్రారంభించగా వారికి టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు. బిఆర్ఎస్ వి జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య. ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతికూర్ రహమాన్ . గవ్వల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో న్యాయవాదులను కలిసి వారికి సంఘీభావం తెలిపారు. అలాగే స్థానిక ఇటిక్యాల మండల నాయకులునారాయణనాయుడు. సత్యం. మల్లేష్ రెడ్డి. పల్లె రాజు. నరసింహ. యున స్. కిరణ్. తదితరులు న్యాయవాదులను కలిసి వారి పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.. పాదయాత్రలో న్యాయవాదులు అధ్యక్షులు శ్రీనివాసులు. జనరల్ సెక్రటరీ నరసింహ. సభ్యులు నాగరాజు యాదవ్. శ్రీధర్ రెడ్డి. యాకోబు. నాగయ్య. గజేందర్ గౌడ్ ఆంజనేయులు. వెంకటేష్ తదితరులు ఉన్నారు.




బీచుపల్లి వద్ద న్యాయవాదుల పాదయాత్రకు సంఘీభావం తెలిపిన నాయకులు

## బాలల హక్కులపై అవగాహన సదస్సు

**మద్దూరు, నవంబర్ 11 ప్రభాతవార్త:** మద్దూరు మండలం పెదిరిపహాడ్ జడ్‌పీ హైస్కూల్‌లో బాలల హక్కుల అవగాహన సదస్సు జరిగింది. చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ జీ. నర్సింహులు మాట్లాడుతూ బాల్య వివాహాలు, బాల కార్మికత్వం అరికట్టాలని, 18ఏళ్ల లోపు పిల్లలకు వివాహం చట్టవిరుద్ధమని తెలిపారు. 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలు 24గంటలు అందుబాటులో ఉన్నాయని, పిల్లల సమస్యలు గమనించిన వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ బాలకృష్ణప్ప, ఉపాధ్యాయులు రవీంద్ర నాయక్, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**కల్వకుర్తి, నవంబర్ 11 ప్రభాతవార్త:** గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ శివరాం అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని మహితా ఆసుపత్రి వారి సౌజన్యంతో మార్చాల గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని మార్చాల గ్రామంలో నిర్వహించారు. వైద్య శిబిరాన్ని ప్రభుత్వ హాస్పిటల్‌సూపరిండెంట్ డాక్టర్ శివరాం, మహిత హాస్పిటల్ కన్సల్టెంట్ సర్జన్ డాక్టర్ కె.యశోదబాయిలు ప్రారంభించారు. వైద్య శిబిరంలోడా.సురేష్, డా.రాజు, డా.మహి మునలు 400మందికి ఉచితంగా బిపి, షుగర్, టెస్టులు చేసి అనంతరం ఉచితంగామందులు అందించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ సిబ్బంది ఏజాస్, కిరణ్, స్టాఫ్ మెంబర్స్ గీత, అజహర్, రఘు, సుదీప్, ప్రశాంత్, హరి, అశోక్, నరేష్, బిందు, ప్రియాంక, లక్ష్మమ్మ, సందీప్, వెంకటేశ్, రాజశేఖర్, సాయి, మార్చాల గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ చైర్మన్ బాలయ్య, మాజీ రైతుసమన్వయ సమితి అధ్యక్షులు తలసాని కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడల మల్లేష్ సంతోష్, మాజీ ఉపసర్పంచ్ మదన్‌మోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మాజీ వార్డు సభ్యులుడొక్కా లింగం, దున్న భాస్కర్, నాయకులు వట్టేపు కిషోర్, నిజాంసర్కార్, గ్రామ పెద్దలు వజ్ర లింగం, పల్స జంగయ్య గౌడ్, తాండ్రతిరుపతి మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం

**జడ్చర్ల, నవంబరు11 ప్రభాతవార్త:** లయన్స్ క్లబ్ జడ్చర్ల ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జడ్చర్లలోని హరిజన వాడ జడ్‌పిహెచ్ఎస్ ఎర్రసత్యం స్కూల్, హరిజనవాడ ప్రాథమిక పాఠశాలకు చెందిన 100కు పైగా విద్యార్థులకు ఉచిత కంటి శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. మున్సిపాలిటీ చైర్ పర్సన్ కోనేటి పుష్పలత, వైస్ చైర్ పర్సన్ సారికల, లయన్స్ క్లబ్ జడ్చర్ల అధ్యక్షులు ధ్రువ బాదిమి, స్థానిక కౌన్సిలర్ రమేష్, పాఠశాల హెచ్ఎం గోవింద్ నాయక్ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పిల్లలు సెల్ ఫోన్, టీవీలు ఎక్కువగా చూడటం వలన కంటికి జరిగే నష్టాలను తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు గొప్పవిఅని వారికి కావలసిన పూర్తి సహకారం అందిస్తాము అని వ్యక్తపరిచారు. అలాగే కంటి అద్దాలు కావలసిన వారికి ఉచితంగా ఇస్తామని, అని రాబోవు కాలంలో మరిన్ని సేవ కార్యక్రమాలను చేపడుతాము అనిలయన్స్ క్లబ్ అధ్యక్షులు ధ్రువ బాదిమి, సెక్రటరీ కాల్వరామ్‌రెడ్డి, కోశాధికారి కొండూరు వెంకటేష్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ పెద్దలు, పాఠశాల సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## అక్షయపాత్ర వద్దు..వంటశాలలే ముద్దు

**నారాయణ పేట, నవంబరు 11 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లాలోప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని ఏఐటియూసీ నేతలు డిమాండ్ చేశారు. అక్షయపాత్ర సంస్థకు ఇచ్చిన కాంట్రాక్టును వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.వెంకటేష్, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.సంతోష్ అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికుల వేతనాలు పెంచి పిఎఫ్-ఈఎస్ఐ సామాజిక బీమా సౌకర్యాలు కల్పించాలని గ్రీన్ ఛానల్ బిల్లులు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలల్లోనే వంటశాలలు కొనసాగించాలని కోరారు. ఈనెల 11న కలెక్టర్ కార్యాలయం 24న రాష్ట్ర కమిషనర్ కార్యాలయం ఎదుట భారీ ఆందోళనలు చేపట్టనున్నట్లు నేతలు తెలిపారు.

## వేతనాలు చెల్లించాలంటూ పారిశుద్ధ్య కార్మికుల ధర్నా

**ఆత్మకూర్ నవంబర్11, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న పరిశుద్ధ కార్మికులు తమకు వేతనాలు చెల్లించాలంటూ మంగళవారం రోజు ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా నిర్వహించారు. గడిచిన తొమ్మిది నెలలుగా తమకు వేతనాలు రాకపోవడం చేత తమ కుటుంబాలు బజారు పాలయ్యే అవకాశం ఉందని వేతనాలు చెల్లించాలంటూ గతంలో పలుమార్లు ఆసుపత్రి సూపరిండెండెంట్ చైతన్య గౌడ్కు విజ్ఞప్తి చేసినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని కార్మికులు వాపోయారు. పారిశుద్ధ కార్మికులకు వేతనాలు చెల్లించాలంటూ గతంలో పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగించినప్పటికీ నేటివరకు వేతనాలు చెల్లించకపోవడం ఎంత వరకు సమంజసమని పట్టణ ప్రజల సైతం ఆశ్చర్య వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 30 పడకల ఆసుపత్రిగా కొనసాగుతున్నప్పటికీ ప్రస్తుతం 23 పడకల ఆసుపత్రిగా గుర్తించడంతో పరిశుద్ధ కార్మికులకు వేతనాలు సైతం తగ్గించి ఇస్తామని ఆసుపత్రి సూపర్ అంటే చైతన్యగౌడ్ పేర్కొనడం ఎంతవరకు సమంజసం అనివారు ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ప్రాతినిత్యమహిస్తున్న ఆత్మకూరు పట్టణం లోనే కనీసం మంత్రి దృష్టికి విషయం తీసుకువెళ్లకుండా 30 పడకల ఆసుపత్రిని కాస్త 23 పడకల ఆసుపత్రికి కుదించడం అధి కారులకే చెల్లిందని వారు తీవ్రస్థాయిలో ఆరోపించారు ఇప్పటికైనా ఆసుపత్రి సూపరింటెండెంట్ తక్షణమేస్పందించితమకువేతనాలు చెల్లిం చాలని లేనిపక్షంలో నిరవధిక ఆందోళన కార్యక్రమాలకు పూను కుంటామనివారుహెచ్చరించారు. కార్మికులు చేపట్టిన ధర్నా కార్యక్ర మానికి పలుప్రజాసంఘాల నాయకులుతమమద్దతు ప్రకటించారు.

## మరోసారి మభ్య పెట్టడానికి కొనుగోలు కేంద్రాలు

◆ జిల్లా బిఆర్ఎస్ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్

**వనపర్తి, నవంబరు 11 ప్రభాతవార్త:** ప్రభుత్వం 53 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ఐకెపి ద్వారా కొన్ని సెంటర్లు ఏర్పాటు చేసిన రైతులకు ఎటువంటి ప్రయోజనం జరగడం లేదని గతంలో బకాయిపడ్డ రూపాయలు చెల్లించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని వాకిటి శ్రీధర్ ఘాటుగా విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. పాలకులకు, అధికారులకు కొనుగోలు కేంద్రాలపై స్పష్టమైన అవగాహన లేదని తలోమాట మాట్లాడడం వల్లరైతులు గందరగోళంలోఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరితో పాటు మొక్క జొన్న పంటల ఉత్పతి బాగా పెరిగిందని మద్దతు ధర లేక మిల్లర్ల దగ్గరకు వెళితే రూ. 1600 వందలకు అడుగుతున్నారని గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు నష్టపోతున్నారని ఆయన అన్నారు. వర్షాలు పెరిగి ఈసారి 2లక్షల 14,77ఎకరాలలో వరి సాగు చేసారని ప్రభుత్వం అంచనా వేసి తగు ఏర్పాట్లు చేసి మద్దతు ధరతో పాటు బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలని వాకిటి శ్రీధర్ డిమాండ్ చేశారు. పేరుకే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారని మార్కెట్ కు వచ్చిన మొక్కజొన్నను కొనుగోలు చేయడం లేదని ప్రభుత్వం వెంటనే మద్దతు ధర రూ.2,400లు ఇచ్చి రైతులను ఆదుకోవాలని వాకిటి శ్రీధర్ డిమాండ్ చేశారు. రైతులకు రెండుసార్లు రైతు బంధు ఎగ్గొట్టారని రుణ మాఫీ కూడా చేయకుండా బోనస్ ఇవ్వకుండా రైతులను అరిగోస పెడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలని అన్నారు.

## తెలంగాణ కవి స్వర్గీయ అందెశ్రీకి ఘన నివాళి



జయజయహే తెలంగాణ రాష్ట్రగీతం ఆలపిస్తూ అందెశ్రీకి ఘననివాళులర్పిస్తున్న ఠాగూర్ మెమోరియల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు

**భూత్పూర్, నవంబర్ 11, ప్రభాతవార్త :** ప్రముఖ తెలంగాణ కవి, కళాకారుడు అందెశ్రీ మృతిపట్ల భూత్పూర్ ఠాగూర్ మెమోరియల్ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు మంగళవారం సంతాపం వ్యక్తం జేస్తూ, ఘననివాళి అర్పించారు. ఉదయం ప్రార్థనా సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం రెండు నిమిషాలు మౌనం పాటించి స్వర్గీయ అందెశ్రీకి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకళాకారుడు, కవి స్వర్గీయ అందెశ్రీ రాసిన తెలంగాణ రాష్ట్ర గీతం 'జయజయహే తెలంగాణ.. జననీ జయకేతనం.. తెలంగాణ రాష్ట్రీయ గీతాన్ని ఆలపించి స్వర్గీయ అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ఠాగూర్ మెమోరియల్ స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆకాంక్షించారు. స్కూల్‌కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య మాటాడుతూ అందెశ్రీకి చదువు లేక పోయినప్పటికి సమాజం నేర్పిన అనుభవం, తాను పడ్డ కష్టాల ద్వారా అవగాహన పాఠం, తెలంగాణ భాష, యాసపై మంచి పట్టును సాధించి 'మాయమై పోతున్నడమ్మా.. అంటూ గొప్పగామానవత్వాన్ని చాటి, తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని తన గళమిప్పి ఆలపించారు. జయజయహే తెలంగాణ.. జననీ జయకేతనం.. అనే గీతం ద్వారా తెలంగాణ వైభవాన్ని గొప్పగా చాటిన మహాతెలంగాణవాది, ఉద్యమకవి అందెశ్రీని కోల్పో వడం తెలంగాణ కవులు, కళాకారులు, ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కాడ్లూర్ చాముండేశ్వరి, ఉపాధ్యాయురాళ్లు సన, మాధవి, పుష్ప, రాణి, సృష్టి, వినీత్ పాల్గొన్నారు.

### జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలి : అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**నారాయణ పేట, నవంబరు11 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లాలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. కలెక్టరేట్‌లో జరిగిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకల అనంతరం మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మైనారిటీస్ వెల్ఫేర్ డే, జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రికెట్‌లో నిరజ్‌చోప్రా, టీమ్ వాలీబాల్‌లో మిల్కా సింగ్ టీమ్ ప్రథమ బహుమతులు గెలుచుకున్నాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో 200 మీటర్ల పరుగులో ఆరిఫ్ చెస్‌లో, అఖిలేష్ రెడ్డి ఖో-ఖోలో, నవీన్ కుమార్, నరేష్ వాలీబాల్‌లో, అక్షయ్ జావెలిన్ త్రోలో, ముజమ్మిల్ 400 మీటర్ల రన్నింగ్‌లో, చరణ్, కార్తీక్ 1500 మీటర్ల రన్నింగ్‌లో, లక్ష్మీ కాంత్ ప్రతిభ కనబరిచినందుకు పతకాలు అందుకున్నారు. విద్యార్థులు ఇంకా ఉన్నత స్థాయి పోటీల్లో రాణించాలని అదనపు కలెక్టర్ ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.ఏ. రషీద్, ఫిజికల్ డైరెక్టర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### వ్యర్థపు నీరుపై రైతుల నిరసన

**వెల్దండ, నవంబర్ 11 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని రాచూరు గ్రామ పరిధిలోని వింటేజ్ కాఫీ కంపెనీ వ్యర్థపు నీటితో సమీప పొలాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కంపెనీ రోడ్డుకు వెళ్లే మార్గంలో గ్రామస్తులతో కలిసి రైతులు నిరసన వ్యక్తం చేశారు. కంపెనీ నుండి వెలుపడే నీటితో పొలాలు పంటలు పండటం లేదని కాలుష్యంతో సుఖమవుతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఘనంగా అబుల్ కలాం జయంతి

**ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలు**





ప్రశంసా పత్రం అందుకుంటున్న ఉపాధ్యాయురాలు ఎం.సరళ, డిప్యూటీ వార్డెన్ దస్తగిరి

**మహబూబ్‌నగర్, నవంబర్ 11 ప్రభాతవార్త:** మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్లోని మైనార్టీ గురుకుల పాఠశాల బాయ్స్ 1లో ఆ అబుల్ కలాం చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి పూలమాలవేసి నివాళులు అర్పించారు. సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉత్తమ సేవలు అందించి ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులకు పురస్కారాలు అందజేశారు. అందులో భాగంగా జడ్చర్ల (నాగసాల) మైనార్టీ బాయ్స్ పాఠశాలకు చెందిన మ్యాథమెటిక్స్ ఉపాధ్యాయురాలు ఎం.సరళకు ప్రశంసా పత్రం తో పాటు, షీల్డ్ అందజేశారు. అదే పాఠశాలకు చెందిన దస్తగిరి కి ఉత్తమ వార్డెన్ అవార్డు ప్రధాన చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జనాబ్ అబ్దుల్ హాబీ సహాబ్, ఆర్ ఎల్ సి కాజా బహుద్దీన్ ప్రిన్సిపాల్ సల్మా తదితరులు పాల్గొన్నారు.

### 5.50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టివేత

**నారాయణ పేట, నవంబరు 11 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా మరికల్ పట్టణ కేంద్రంలో అక్రమంగా ప్రభుత్వ పిడిఎస్ బియ్యం సేకరిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు .అశోక్ నగర్‌కు చెందిన దాసరి యువరాజు, చుట్టుపక్కల ఇళ్లలోనుంచి పిడిఎస్ రైస్ సేకరించి ఆత్మకూరు ప్రాంతానికి రవాణా చేయడానికి సిద్ధమవుతున్న సమయంలో పక్కా సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్, మరికల్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ దాడులలో మొత్తం 5.50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టుబడగా బియ్యాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి డీటైల్ పంచనామా నిర్వహించారు. అనంతరం నిందితుడు యువరాజుపై కేసు నమోదు చేయడం జరిగిందని మరికల్ ఎస్సై రాము తెలిపారు. అక్రమంగా ప్రభుత్వ సరుకులను వ్యాపారం చేయాలనే ప్రయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

### బాల్య వివాహాలను అడ్డుకుంటాం : ఎస్సై రమేష్

**ఊట్కూర్, నవంబరు 11 ప్రభాతవార్త :** బాల్యవివాహం ఒ జీవితాన్ని చీకటిలోకి నెడుతుంది.. అని"ఊట్కూర్ ఎస్సై వి. రమేష్ ఈ మాటలతో గ్రామ ప్రజలకు గట్టిగా హెచ్చరిక చేశారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో మైనర్లకు వివాహాలు జరిపే ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం రావడంతో ఆయన స్పందించారు. చట్టానికి విరుద్ధంగా జరిగే ఇలాంటి వివాహాలను పోలీసులు ఏ పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ఆయన స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు పూర్తైన తర్వాతే పెళ్లిళ్లు జరగాలి. చిన్న వయసులో పెళ్లి అంటే పిల్లల బాల్యం, వారి భవిష్యత్తు, కలలన్నీ నాశనం చేయడమే," అని ఎస్సై రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థినులు చదువుపై దృష్టి పెట్టి స్వయంగా తమ జీవితాన్ని వెలుగులోకి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే మైనర్ విద్యార్థులు వాహనాలు నడపకూడదని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యే ఆయుధం.. చట్టం రక్షణ వాటిని గౌరవిస్తేనే భవిష్యత్తు బంగారంలా మెరుస్తుంది," అని ఎస్సై రమేష్ అన్నారు.

## హాస్పిటల్‌కు వెళ్లివస్తూ అనంతలోకాలకు..

◆ రోడ్డు ప్రమాదంలో తల్లీకొడుకు మృతి

◆ మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ వద్ద ఘటన





తల్లికొడుకు(ఫైల్)

**మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 11, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండల పరిధి లోని దమ్మాయిపల్లి గ్రామంవద్ద మంగళవారం జరిగినరోడ్డు ప్రమాదంలో తల్లి కొడుకులు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే.. కోయిలకొండ మండలం వీరన్నపల్లి గ్రామానికి చెందిన బలరాం (36), తన తల్లి ముత్యాలమ్మ (54)ను అనారోగ్యం కారణంగా మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రికి మోటార్ సైకిల్ పై తీసుకువెళ్లాడు. వైద్య సేవల అనంతరం తల్లి కొడుకులు ఇరువురు తమ సొంత గ్రామానికి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ క్రమంలో దమ్మాయిపల్లి గ్రామానికి చేరుకోగానే కోయిలకొండ వైపు నుంచి మహబూబ్ నగర్ వెళ్తున్న కారు వేగంగా మోటార్ సైకిల్‌ను ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తల్లి కొడుకులు అక్కడికి అక్కడే మృతి చెందారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

**గద్వాలటౌన్ నవంబర్11, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమర యోధుడిగా, కేంద్ర తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ దేశానికి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేమని జిల్లా కలెక్టర్ బి.ఎం. సంతోష్ అన్నారు. మంగళవారం భారతరత్న మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 137 వ జయంతి పురస్కరించుకొని జాతీయవిద్యా దినోత్సవంగా నిర్వహించుకుంటున్న నేపథ్యంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల ఐడిఓసి వద్ద ఆయన చిత్రపటానికి కలెక్టర్ బి. ఎం. సంతోష్, గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ఇతర అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మౌలానా అరబిక్, ఇంగ్లీష్, ఉర్దూ, హిందీ, పర్షియన్, బెంగాలీ తదితర అనేక భాషల్లో ప్రావీణ్యత పొందారన్నారు. హిందూ, ముస్లిం ఐక్యత ఆధారంగా ఆల్ బలగ్ అనే పత్రికను ప్రారంభించి భారత జాతీయ వాదిగా పేరుగాంచారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లోపాల్గొని పదేళ్లపాటు జైలుశిక్ష అనుభవించారని పేర్కొన్నారు. అబ్దుల్ కలాం ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం ద్వారా ముస్లిం కమ్యూనిటీలో బ్రిటిష్ వ్యతిరేక భావాలు పెంచి అన్ని వర్గాల ప్రజలు స్వాతంత్రోద్యమంలో పాల్గొనేలా కీలకపాత్ర పోషించారన్నారు. దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 11 ఏళ్ల పాటు పనిచేసిన మౌలానాకు మరణాంతరం 1992లో భారతరత్న పురస్కారం లభించిందన్నారు. విద్య లేకుండా దేశము అభివృద్ధి చెందదని, విద్య స్వాతంత్రానికి రెండోరూపముగా పేర్కొన్న మౌలానా భారత విద్యావ్యవస్థకు బలమైన పునాదివేసిన మహానుభావుడని కొనియాడారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు, మైనారిటీ సంక్షేమ శాఖ ఇన్చార్జి జిల్లా అధికారి నిషిత, ఏవో భూపాల్‌రెడ్డి, ఇతరఅధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మైనారిటీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

**మహబూబ్‌నగర్, నవంబర్ 11, ప్రభాతవార్త:** భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ 137వ జయంతి వేడుకల్ని మంగళవారం రాజేంద్రనగర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో జిల్లా ఆల్ ఫైజ్ సొసైటీ ఆధ్వర్యంలో చిన్నారులకు విద్యా సామాగ్రిని సొసైటీ అధ్యక్షుడు జహంగీర్ బాబ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జహంగీర్ బాబ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మైనార్టీ సంక్షేమం కోసం మరిన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయాలని కోరారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యను పెంపొందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు పద్మ, ఆయ పద్మతో పాటు సొసైటీ సభ్యులు అబ్దుల్ ఖాదర్, మహబూబ్‌అలీ, మౌనిక, మురళి, తబస్సుం, సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.

**నారాయణ పేట, నవంబరు 11 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని యాద్గిర్ రోడ్‌లో గల తెలంగాణ మైనార్టీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎంఏ రషీద్ ముఖ్య అతిథిగా హాజరై మౌలానా ఆజాద్ స్వాతంత్ర్య సమరయోధుడు తొలి విద్యాశాఖ మంత్రి అని ఆయన జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. హిందూ ముస్లిం ఐక్యతకు కృషి చేసిన లౌకికవాది మౌలానా ఆజాద్ స్ఫూర్తితో మైనారిటీ పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకుండా చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు కళాశాల ప్రిన్సిపల్ జగదీష్ మాట్లాడుతూ 2020లో 12 మంది విద్యార్థులతో ప్రారంభమైన కళాశాల ప్రస్తుతం 134 మందితో విజయవంతంగా కొనసాగుతోందని తెలిపారు. ప్రతి ఏటా వందశాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా విద్యార్థులు ఐటీ, నీట్ పరీక్షల్లో ప్రతిభ చాటుతున్నారని పేర్కొన్నారు, తల్లిదండ్రుల సమస్యల పరిష్కారానికి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులను రాయిలా తీర్చిదిద్దడమే మా లక్ష్యం అని ఆయన అన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.









**పెబ్బేరు, నవంబరు 11 ప్రభాతవార్త :** పెబ్బేర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్‌జన్మదినాన్ని పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత వహించిన మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ డా. తూర్పింటి నరేశ్ కుమార్ మాట్లాడుతూ బహుభాషా వేత్తగా పాత్రికేయుడుగా విద్యావేత్తగా స్వాతంత్ర సమరయోధుడిగా విభిన్న రంగాల్లో తనదైన ముద్రను కొనసాగించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ గురించి మాటాడుతూ భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాల పాటు కృషిచేసిన మౌలానా యుజిసి ఏర్పాటులోనూ ఐఐటి ఖరగ్‌పూర్ స్థాపనలోనూ కీలక భూమిక పోషించారని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చిన్న గోపాల్, నర్సింహులు, విజయలక్ష్మి, సుమిత్ర, ఉదయ, రవి కుమార్, హఫీజ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

■ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**కృష్ణ, నవంబరు 11 ప్రభాతవార్త:** కృష్ణ మండలం గుడేబల్లూరు లోని పీఏసీఎస్, ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలంలో ఈ వారం రోజుల్లో హార్వెస్టింగ్ ఎంత ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఎన్ని బస్తాలు ఉన్నాయని అడగగా వారానికి 5000 బ్యాగ్‌ల బ్యాగులు వస్తాయని, ఒక లారీలో 800 ల ధాన్యపు బ్యాగులను నింపి పంపిస్తామని అక్కడి సిబ్బంది తెలిపారు. రెండేసి కేంద్రాలు ఉన్న చోట కూలీలను పురమాయించాలని ఆమె సూచించారు. గుడేబల్లూరు కేంద్రం నుంచి ఇప్పటి వరకు 1776 ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించడం జరిగిందని సిబ్బంది చెప్పారు. అన్ని కేంద్రాలలో తప్పనిసరిగా వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని, కొనుగోళ్లకు సంబంధించిన అన్ని వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ముఖ్యంగా కేంద్రాలలో రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ప్రతి అధికారి స్థానికంగా ఉండాలన్నారు. సన్నరకం బియ్యం బస్తాలపై ఎస్ అని రాయాలన్నారు. అలాగే సంచులలో ధ్యానం నింపిన తరవాత ఎర్ర దారంతో సంచులను కుట్టించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, పిఏసిఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏవో సుదర్శన్‌గౌడ్, ఏపిఎం బసవరాజ్, సంబంధిత అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సైబర్ కేసులు వేగవంతంగా పరిష్కరించాలి

■ అదనపు ఎస్పీ రత్నం





మాట్లాడుతున్న అదనపు ఎస్పీ , హాజరైన పోలీస్ అధికారులు, సైబర్ వారియర్స్

**మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబరు 11 ప్రభాతవార్త:** సైబర్ కేసులు వేగవంతంగా పరిష్కరించాలని అదనపు ఎస్పీ రత్నం ఆదేశించారు. జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంకాన్ఫరెన్స్ హాల్‌లో అన్ని సైబర్ వారియర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే లోక్ అదాలత్ దృష్ట్యా, సైబర్ నేరాలకు సంబంధించిన పెండింగ్ కేసుల పరిష్కార ప్రక్రియలో పాటించాల్సిన చర్యలను ఆయన విశదీకరించారు. ముఖ్యంగా సంబంధిత కోర్టుల్లో రిఫండ్ ఆర్డర్ల కోసం రిక్విజిషన్ పిటిషన్లు సరైన విధంగా దాఖలు చేయాలని సూచించారు. "పుట్ ఆన్ హోల్డ్" కింద ఉన్న ప్రతి కేసులో బాధితులను పిలిపించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ ఎస్ఐ శ్రావణ్, సైబర్ వారియర్స్ బృందం పాల్గొన్నారు.

### మిషన్ భగీరథ నీటి వృథా వద్దు : కమిషనర్

**మద్దూరు, నవంబరు11 ప్రభాతవార్త:** మద్దూరు మున్సిపాలిటీలోని ఎస్సీ కాలనీలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ పర్యటించారు. మిషన్ భగీరథ నీటిని కొందరు వృథా చేస్తున్నట్లు గమనించి, ప్రతి ఇంటి నల్లలకు వాటర్ ట్యాబ్‌లు అమర్చుకోవాలని సూచించారు. నీటిని బాధ్యతాయుతంగా వినియోగించాలన్నారు. లీకేజీలు గమనించిన వెంటనే మున్సిపాలిటీకి తెలియజేయాలని సూచించారు.

### మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు : సిఐ నాగరాజు

**ఉప్పునుంతల, నవంబరు 11 ప్రభాతవార్త:** డిండి బ్రిడ్జి సమీపంలోని లత్తిపూర్ గ్రామంలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించి ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట సీఐ నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఐ నాగరాజు మాట్లాడుతూ రోడ్డుపై జరుగుతున్న ప్రమాదాలకు గల ప్రధాన కారణాలు, వాటిని నివారించడానికి తీసుకోవలసిన చర్యల గురించి వాహనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించడం ముఖ్యమని వెల్లడించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ చేయకపోవడం ద్వారా ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని సకాలంలో ఆసుపత్రికి తరలించడం ద్వారా గోల్డెన్ టైమ్‌లో చికిత్సలభించి ప్రాణాలు రక్షించవచ్చని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో హైవే పెట్రోలింగ్ సిబ్బంది, విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.



### ముదిరెడ్డిపల్లి బీసీ సంఘం నూతన కమిటీ ఎన్నిక



**రాజాపూర్, నవంబరు 11 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి, నందిగామ గ్రామాల్లో మంగళవారం గ్రామ బీసీ సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నట్లు మండల బీసీ నాయకులు తెలిపారు. ముదిరెడ్డిపల్లి గ్రామ అధ్యక్షునిగా కాంచన పల్లి అంజనేయులు, ప్రధానకార్యదర్శిగా చుక్కంపేట నర్సింలు, గౌరవ అధ్యక్షులుగా మొల్గర నారాయణ, ఉపాధ్యక్షులుగా పాలమాకుల బాల చిన్నయ్య, సాయిల్లేష్, వడ్డే శ్రీను, కోశాధికారిగా ఉండెకోటిశేఖర్, సోషల్ మీడియా కన్వీనర్‌గా మొల్గర రాఘవేందర్, కావలి శ్రీనులతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నందిగామ గ్రామ కమిటీ అధ్యక్షునిగా పులందాస్ చిన్ని కృష్ణ, గౌరవ అధ్యక్షులుగా గొడుగు వెంకటేష్ ప్రధానకార్యదర్శిగా పాలకొండ వెంకటేష్, ఉపాధ్యక్షులుగా కోరుపాల సుమన్, కావలలి శ్రీను, కోశాధికారిగా గొడుగు శివకుమార్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బోల్ల రాఘవేందర్, పోలదాస్ శ్రీను, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవాదుల ధర్నా

**నారాయణపేట, నవంబరు 11 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో న్యాయవాదుల సంరక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేస్తూ నారాయణపేట జిల్లా కోర్టు ఎదుట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గేట్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల రక్షణ చట్టం కోసం అలంపూర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 12నఅలంపూర్‌నుంచి హైదరాబాద్ వరకు జరగనున్న పాద యాత్రకు పూర్తి మద్దతు ప్రకటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నందునామాజీ, ప్రధాన కార్యదర్శి చెన్నారెడ్డి, న్యాయవాదులు రఘువీర్‌యాదవ్, సీతారామ రావు, మల్లికార్జున్, ఆకులబాలప్ప, నారాయణ పాల్గొన్నారు.

### సకాలంలో డబ్బులు అందేవిధంగా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

లేదో పరిశీలించారు. రైతులకు నాణ్యమైన ధాన్యం విషయంలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం మోజర్ల వారాహి రైస్ మిల్లును సందర్శించిన కలెక్టర్ రైస్ మిల్లులో ధాన్యం దించుకుంటున్నవిధానాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలోనే అన్ని ప్రమాణాలు పరిశీలించి నాణ్యమైన ధాన్యాన్ని మిల్లుకు పంపిస్తున్నందున వెంటనే ధాన్యం దించుకొని ట్రక్ షీట్ వెంటనే కొనుగోలు కేంద్రానికి పంపించాలని సూచించారు. ట్రక్ షీట్ త్వరగా పంపడం వల్ల రైతు అమ్మిన ధాన్యం వివరాలు త్వరగా ఆన్లైన్‌లో అప్లోడ్ చేసి వెంటనే డబ్బులు రైతు ఖాతాలో జమ అయ్యే విధంగా సులువవుతుందన్నారు. అవసరం అనుకుంటే వాట్సాప్ గ్రూప్‌ఏర్పాటు చేసుకుని వాట్సాప్‌ద్వారా పంపించాలని ఆదేశించారు. ధాన్యం మిల్లింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించిన కలెక్టర్ మిల్లింగ్ ఆడించి త్వరగా ఎఫ్‌సిఐ. కి అప్పగించాలని యజమానిని ఆదేశించారు. సాటెక్స్ పెట్టారా లేదా అని పరిశీలించారు. సివిల్ సప్లై అధికారి విశ్వనాథ్, పిడి, డీఆర్డీఓ ఉమా దేవి, పెద్దమందడి తహసిల్దార్ పాండు నాయక్, మండల వ్యవసాయ అధికారి, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

### బహు భాషా కోవిదుడు

(మొదటి పేజీ తరువాయి)

కలెక్టర్ మోలానా అబుల్ కలాంఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన మోలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని, ఆయన సమయంలోనే యు.జి.సి ,ఐఐటి వంటి అత్యున్నత విద్యా సంస్థలను స్థాపించడం జరిగిందని తెలిపారు. అంతేకాక ఆయన భారతరత్న గ్రహీత అని, సకల భాషా కోవిదుడని, అరబిక్, ఇంగ్లీష్ ,ఉర్దూ, హిందీ, పర్షియా, బెంగాలీ వంటి భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించారని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి, హిందూ, ముస్లిం ల సమైక్యతకు ఎంతో కృషి చేశారని చెప్పారు. మైనార్టీ నాయకులు సూచనలు మేరకు మోలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి రోజున విద్యార్థులకు విద్యాసంస్థల్లో వివిధ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. నేడు విద్యార్థులు పాఠ్య పుస్తకాలు తప్ప ఇతర పుస్తకాలు చదవడం తగ్గిందని, మహనీయుల గురించి వారికి తెలియజేయ వలసిన అవసరం ఉందని అన్నారు మహనీయుల జయంతి రోజున వారి సేవలు స్మరించుకునివారి ఆశయాల కనుగుణంగా, వారి స్ఫూర్తితో జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఇంచార్జిజిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఇందిర, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కె.జనార్ధన్, మైనార్టీ నాయకులు ఎం.ఏ.హాది, యూసుఫ్ బిన్‌నాసర్, అన్వర్ పాషా, మహమ్మద్ హ్నాష, జాకీర్ సాబ్, సయ్యద్ సాదత్ ఉల్లా హుస్సేన్, తాఖి హుస్సేన్ తాఖి పాల్గొన్నారు.

### శ్రీకురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

(మొదటి పేజీ తరువాయి)

వారు తెలిపారు. గత సంవత్సరం బ్రహ్మోత్సవ సందర్భంగా రెండవ హుండీ రూ.22 లక్షల 78, 894 ఆదాయం రావడం జరిగింది. గత సంవత్సరానికి పోలిస్తే ఈ సంవత్సరం రెండవ హుండీ 2 లక్షల 4 వేల 734 రూపాయల ఆదాయం అధికంగా రావడం జరిగింది. ఈ కార్యక్రమంలోదేవదాయ శాఖ పరిశీలకులుశ్రీనివాస్, పాలకమండలి సభ్యులు భారతమ్మ, గౌని రాము, నాగరాజు, భాస్కరాచారి, కమలాకర్, ఉంద్యాల శేఖర్, గోపాల్, శ్రీధర్‌రెడ్డి, రాములు, ఆలయఅర్చకులు వెంకటయ్య, సత్యనారాయణ, విజయ్, లక్ష్మీ నరసింహ చార్యులు, శ్రీవారి సేవ సమితి మహిళా సభ్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

**రాజాపూర్, నవంబరు 11 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం రాజాపూర్ మండల కేంద్రం శివారులోని బంగారు మైసమ్మ ఆలయ ముందు గల జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎస్ఐ శివానంద్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. భూత్పూర్ మండలం మద్దిగట్ల గ్రామానికి చెందిన వడ్ల శ్రీహరి మద్దిగట్ల నుంచి హైదరాబాద్ వైపు తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా బంగారు మైసమ్మ వద్దకు రాగానే ఓ బొలేరో వాహనం బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో వడ్ల శ్రీహరి అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రమాద సంఘటనపై భార్య వడ్ల రేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానంద్‌గౌడ్ తెలిపారు.

### ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

**దేవరకద్ర, నవంబరు 11 ప్రభాతవార్త:** రైతులు ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని కౌకుంట్ల మండల అధ్యక్షులు రాఘవేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కౌకుంట్ల మండలం రేకులం పల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులుమాట్లాడుతూ రైతుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమన్నారు. రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని అమ్మాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల ఓబీసీఅధ్యక్షులు ఆంజనేయులు ,మండల యూత్ అధ్యక్షులు నరేష్‌కుమార్, మండల సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, వివిధ గ్రామాల అధ్యక్షులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### పరిమితికి మించి ఆటోలో రవాణా చేస్తే కఠిన చర్యలు : ఎస్సై వెంకటేశ్వర్లు

**నారాయణ పేట, నవంబరు 11 ప్రభాతవార్త :** జిల్లా ఎస్పీ డా.వినీత్ ఆదేశాల మేరకు నారాయణపేట పట్టణంలో ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో పరిమితికి మించి విద్యార్థులను ఆటోల్లో తరలిస్తున్న ఆరుగురు డ్రైవర్లను గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు. ఆటో డ్రైవర్లు విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడరాదని పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని ఎస్సై వెంకటేశ్వర్లు హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి నిరక్ష్యం పునరావృతమైతే వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరిమితికి మించి ఆటోలలో పంపరాదని కోరారు. డ్రైవర్లు ట్రాఫిక్‌నిబంధనలుపాటించి మితిమీరిన వేగంతో ప్రయాణించవద్దని సూచించారు. ఈకార్యక్రమంలోఎస్సై గాయత్రి, ఏఎంవీఐ సాయి, తేజరెడ్డి, ఏఎస్ఐ అంజయ్య, పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

### ఇసుక అక్రమ రవాణా: కేసు నమోదు

**దామరగిద్ద, నవంబరు 11 ప్రభాతవార్త:** కోయిలకొండ మండలం ఆచార్య పూర్ గ్రామానికి చెందిన గోవిందు తన టిప్పర్ నెంబరు ఎపి 26 టిఏ 5277 అదే గ్రామానికి చెందిన శంకర్ తన టిప్పర్ నెంబరు ఎపి 26 టిఎల్ 1197 గల వాటిలో కోయిలకొండ నుండి ఇసుకను నింపుకొని మధ్యరాత్రి సుమారు రెండు గంటలకు దామరగిద్ద కు వస్తుండగా దామరగిద్ద తండాలో అట్టి అక్రమ ఇసుక తరలిస్తున్న టిప్పర్లను పోలీసులు పట్టుకుని పిఎస్ కు తరలించి కేసు నమోదు చేశారు.